క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ పొదిలి మండల కన్వీనర్‌గా సంజీవరెడ్డి


గుజ్జుల సంజీవరెడ్డి

పొదిలి రూరల్‌: పొదిలి మండలం వైఎస్సార్‌ సీపీ కన్వీనర్‌గా గుజ్జుల సంజీవరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. ఏలూరు గ్రామానికి చెందిన సంజీవరెడ్డి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవీ కేటాయించేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంజీవరెడ్డిని పార్టీ నాయకులు కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వాకా వెంకటరెడ్డి, కార్యకర్తలు అభినందించారు.

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ జేడీ

పొదిలి రూరల్‌: పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పొదిలిలోని వ్యవసాయ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం జేడీఏ మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ నగదు అందని రైతులు సంబంధిత వ్యవసాయాధికారులను కలిసి తగిన వివరాలు అందజేయాలని సూచించారు. పంటల బీమా చేయించుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్‌ఎస్‌ నూతన లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో గురువారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. సూరావారిపల్లె గ్రామ పంచాయతీలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్‌ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తహసీల్దార్‌కు ఎంఈఓల సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు

కంభం: స్వాతంత్య్ర దిన వేడుకల సందర్భంగా ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రం అందుకున్న తహసీల్దార్‌ వి.కిరణ్‌ను బుధవారం సాయంత్రం మండల విద్యాశాఖాధికారులు అబ్దుల్‌ సత్తార్‌, శ్రీనివాసులు సన్మానించి, అభినందలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఐఎస్‌ కోఆర్డినేటర్‌ చిన్ని పద్మావతి, సిబ్బంది శేఖర్‌, రామచంద్రుడు, మురళి, నాయక్‌ పాల్గొన్నారు.

గీత కులాలకు రెండు బార్లు

మార్కాపురం టౌన్‌: మార్కాపురంలో రెండు బార్‌ అండ్‌ రెస్టారెంట్లు మంజూరయ్యాయని, వాటిని గీత కులాలకు కేటాయించినట్లు ఎక్సైజ్‌ సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని గౌడ, గాండ్ల సామాజిక వర్గాలకు కేటాయించారని, లైసెన్స్‌ పొందిన వారు సెప్టెంబర్‌ 1 నుంచి బార్‌ అండ్‌ రెస్టారెంట్లు ప్రారంభించుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మూడు రకాలుగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షల నాన్‌ రీఫండబుల్‌ ఫీజు, రూ.10 వేల ప్రాసెసింగ్‌ ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు. లైసెన్స్‌ ఫీజు ఏడాదికి 27,50,000 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈనెల 30న కలెక్టర్‌ ఆధ్వర్యంలో లాటరీ తీసి లైసెన్సులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి తూట్లు!

- ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు
- అద్దె భవనాల్లో ఉద్యోగులు, ప్రజల అవస్థలు
- మైనర్‌ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించని కూటమి సర్కారు


రాయవరంలో పూర్తయి ప్రారంభానికి నోచుకోని సచివాలయం

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా పల్లెల్లో పాలన గాడిన పడలేదు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టగా.. కూటమి పాలకులు మాత్రం అందుకు తూట్లు పొడిచే దిశగానే గడిచిన 15 నెలలుగా అడుగులేస్తున్నారు. ప్రజలు, రైతుల కోసం నిర్మించిన సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, వెల్‌నెస్‌ సెంటర్లను కొద్దిపాటి రిపేర్లు చేసి ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహించడంతో వాటి చుట్టూ చిల్లచెట్లు పెరిగి పాడుబడిన స్థితికి చేరుకుంటున్నాయి. ప్రభుత్వ నిర్లక్షంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్కాపురం మండలంలోని ఇడుపూరు, రాయవరం, చింతగుంట్ల తదితర గ్రామాల్లో నిర్మించిన రైతుసేవ కేంద్రాలు, గ్రామ సచివాలయం ప్రారంభానికి నోచుకోక పాలకుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. ఇడుపూరు గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయాన్ని, రూ.20.5 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని, రూ.21.8 లక్షలతో హెల్త్‌ క్లినిక్‌ సెంటర్‌ నిర్మాణం చేపట్టారు. అయితే రైతు సేవా కేంద్రం నిర్మాణం పూర్తికాగా, సచివాలయంలో విద్యుత్‌ వైరింగ్‌, ప్లంబింగ్‌ పనులు చేపట్టాల్సి ఉంది. అదే విధంగా రాయవరంలో కూడా సచివాలయం, రైతు సేవా కేంద్రాలను నిర్మించారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. కొద్దిపాటి పనులు పూర్తిచేసుకుని ప్రారంభించుకనే అవకాశం ఉన్నప్పటికీ ఏదో ఒక సాకు చెప్పి పక్కనబెడుతుండటంతో వాటి చుట్టూ చిల్ల చెట్లు పెరిగాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఇడుపూరులో పనులు పూర్తయి నిరుపయోగంగా ఉన్న సచివాలయం

భవనాలను త్వరగా ప్రారంభించాలి



మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయాలను, రైతు సేవా కేంద్రాలను, వెల్‌నెస్‌ సెంటర్లను ప్రభుత్వం ప్రారంభించాలి. తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంది. బిల్లులు చెల్లించడంతోపాటు చిన్నచిన్న పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌ సీపీ పబ్లిసిటీ వింగ్‌ సెక్రటరీ


ఇడుపూరులో ప్రారంభం కాని రైతు సేవా కేంద్రం


రాయవరంలో అసంపూర్తిగా నిలచిన రైతు సేవా కేంద్రం

వైఎస్సార్‌ సీపీ బలోపేతానికి శ్రమిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

- పార్టీ శ్రేణుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే 'అన్నా'

పొదిలి రూరల్‌: వైఎస్సార్‌ సీపీ బలోపేతానికి కలిసికట్టుగా శ్రమిద్దామని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం పొదిలిలో వైఎస్సార్‌ సీపీ గ్రామ స్థాయి నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వారికి వివిధ పదవులతో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే గుర్తింపు ఇచ్చారన్నారు. అన్ని గ్రామాల్లో సామాజిక వర్గాల ప్రకారం ఉత్సాహంగా పనిచేసే కార్యకర్తలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో గుర్తించాలని సూచించారు. మండలంలో 21 అనుబంధ విభాగాల్లో.. ఒక్కో కమిటీకి 15 మంది సభ్యులు ఉండాలన్నారు. గ్రామ కమిటిలో ఒక అధ్యక్షుడు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, నలుగురు కార్యదర్శులు ఉంటారన్నారు. అనుబంధ విభాగ కమిటీలైన యువజన, మహిళా, రైతు విభాగ కమిటీల్లో అధ్యక్షుడు, ఇద్దరు ప్రధాన కార్యదర్శులు, ఇద్దరు కార్యదర్శులు ఉంటారన్నారు. ఈ జాబితాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. పార్టీ కార్యాలయం పదవులు కేటాయించిన తర్వాత వారంతా గ్రామ స్థాయిలో కార్యకర్తలతో మమేకమై పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొనేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు అబద్ధపు హామీలను, మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, కొత్తపుల్లి బ్రహ్మారెడ్డి, కె.సుబ్బారావు, కె.శ్రీనివాసరావు, గిరిబాబురెడ్డి, కోదండరామిరెడ్డి, రమణారెడ్డి, ప్రసాద్‌, పిచ్చిరెడ్డి, శావసన్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదు

- ఏపీజీఈఏ కంభం తాలుకా అధ్యక్షుడు ప్రసాద్‌ రెడ్డి


మాట్లాడుతున్న ఏపీజీఈఓ తాలూకా అధ్యక్షుడు ప్రసాదరెడ్డి

కంభం: ప్రభుత్వ అధికారులపైన దాడి చేస్తే సహించేది లేదని ఏపీజీఈఏ కంభం తాలుకా అధ్యక్షుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం సమీపంలోని శిఖరం అటవీ చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, వారి అనుచరులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అటవీ శఖాఖ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాసనాలు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు అండగా నిలవాల్సిన వారే ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీజీఈఏ తాలుకా కార్యదర్శి రంగస్వామిరెడ్డి, ట్రెజరర్‌ వెంకట రంగయ్య, అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరకు అమ్మితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్‌..


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ అబ్దుల్‌ రఫీక్‌

బేస్తవారిపేట: యూరియా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారి షేక్‌ అబ్దుల్‌ రఫీక్‌ హెచ్చరించారు. యూరియా లభ్యం కాక రైతులు ఇబ్బంది పడుతున్న విషయమై 'బలం మందు తొరుకుతలేదు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. బేస్తవారిపేటలోని పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాలకు ఇప్పటి వరకు 337 టన్నుల యూరియా పంపిణీ చేశామని, మరో 108 టన్నుల యూరియా అవసరం ఉందని ఇండెంట్‌ పెట్టినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా అందజేస్తామని చెప్పారు.

పంటల బీమా గడువు పెంపు

ప్రధానమంత్రి ఫసల్‌ బీమా పథకంలో వరి, కంది, ఎండుమిర్చి, మినుము, సజ్జ పంటలకు బీమా చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఏఓ షేక్‌ అబ్దుల్‌ రఫీక్‌ తెలిపారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నారావు

కొమరోలు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ చెన్నారావు సూచించారు. కొమరోలులోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అన్నిశాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతోపాటు వాటిని వేగంగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులు నివేదికలు అందజేస్తే కలెక్టర్‌కు సమర్పిస్తానని స్పష్టం చేశారు.

గణేశ్‌ మండపాలకు అనుమతి తప్పనిసరి

- డీజేలకు అనుమతి లేదు.. ఓవరాక్షన్‌ చేస్తే జైలుకే..
- విలేకర్ల సమావేశంలో మార్కాపురం సీఐ వెల్లడి


మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సైలు

మార్కాపురం: వినాయక చవితి పండగను పురస్కరించుకుని మార్కాపురం సర్కిల్‌ పరిధిలో ఏర్పాటు చేసే గణేశ్‌ మండపాలకు పోలీసు, విద్యుత్‌ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి సర్కిల్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా చిన్న విగ్రహం ఏర్పాటు చేసినా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేశ్‌ ఉత్సవాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని చెప్పారు. అనుమతి తీసుకున్న తర్వాతే సాంస్కృతిక కార్యక్రమాలైన భరతనాట్యం, సంప్రదాయ సంగీత కచేరీలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. నిర్వాహకుల పూర్తి సమాచారం పోలీసులకు అందించాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, రాత్రిపూట విగ్రహం వద్ద ఎవరో ఒకరు కాపలా ఉండాలన్నారు. మద్యం తాగి వినాయకచవితి ఉత్సవాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపం వద్ద అగ్నిమాపక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశాల వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. మున్సిపల్‌, రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లతో పాటు క్రేన్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావు పాల్గొన్నారు.

ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య

కొమరోలు: ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ కామూరి అమూల్య సూచించారు. కొమరోలు పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యశాల అభివృద్ధి తీర్మానాలపై చర్చించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులను విసుక్కోకుండా సేవలు అందిచాలని ఎంపీపీ స్పష్టం చేశారు. సమావేశంలో డాక్టర్‌ చంద్రశేఖర్‌, డాక్టర్‌ శాంతి, ఎంపీడీఓ చెన్నారావు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అవగాహన అవసరం

కొనకనమిట్ల: సీజనల్‌ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్‌ సురేఖ పేర్కొన్నారు. మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందజేశారు. వైద్యురాలు మాట్లాడుతూ.. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. వీలైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగడం ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ రాఘవ సురేఖ, హెచ్‌ఈఓ నారాయణరెడ్డి, ఏఎన్‌ఎంలు శ్యామల, కెతూర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్‌ సురేఖ

బైకులతో బెంబేలెత్తిస్తున్న యువకులు


కంభం బస్టాండ్‌ రోడ్డులో బైక్‌లపై వేగంగా వెళ్తున్న యువకులు

కంభం: ప్రధాన రహదారులపై మితి మీరిన వేగంతో ద్విచక్రవాహనాలు నడుపుతున్న యువకులు జనాన్ని బెంబేలెత్తిస్తున్నారు. హై ఎండ్‌ బైక్‌ల సైలెన్సర్లు మార్చి భారీగా శబ్దం చేస్తూ పాదచారులు, ఇతర వాహనదారులను అయోమయానికి గురిచేస్తున్న సంఘటనలు కంభం పట్టణంలో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలలు ఉన్న రావిపాడు రోడ్డు, వైజంక్షన్‌, ప్రభుత్వ జూనియర్‌ కళాశాల సమీపంలో ఉదయం, సాయంత్రం వేళ కళాశాలలు వదిలిన సమయంలో పలువురు యువకులు బైక్‌లపై రయ్‌మని దూసుకెళ్తుండటంతో బాలికలు, యువతులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి పూట హైవేపై బైక్‌ రేసింగ్‌లతో యువకులు హల్‌ చేయడం పరిపాటిగా మారింది. పోలీసులు తక్షణమే స్పందించి యువకులకు కౌన్సెలింగ్‌ ఇవ్వడంతోపాటు అధిక శబ్దాలు వచ్చే బైక్‌ సైలెన్సర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సచివాలయ సిబ్బంది పని తీరు మార్చుకోవాలి

అర్ధవీడు: మండలంలోని కాకర్ల గ్రామ సచివాలయాన్ని బుధవారం డివిజనల్‌ అభివృద్ధి అధికారి బి.బాలునాయక్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఫీల్డ్‌, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.